ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రేపు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.
2. హైదరాబాద్ విమోచన దినోత్సవం చారిత్రాక ప్రాధాన్యతను ప్రజలు మర్చిపోయేలా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.
3. నాగపూర్-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం వర్చువల్ గా ప్రారంభిస్తారు.
4. ముస్లింలు ఈరోజు మిలాద్ ఉన్ నబీని జరుపుకుంటుండగా హైదరాబాద్ లో గణేశ్ నిమజ్జనోత్సవాలు కూడా ప్రారంభం కావడంతో మతసామరస్యం వెల్లివిరుస్తోంది.

---------

ప్రజాపాలన

రేపు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ లో పబ్లిక్ గార్డెన్స్, అమరవీరుల స్థూపం వద్ద ప్రధాన వేడుకలు జరుగుతాయి. రేపు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పతకాలను ఆవిష్కరిస్తారు.

డెస్క్

బీజేపీ

హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రేపు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్నట్లు కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి

సంజయ్ తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఛాయచిత్ర ప్రదర్శనను నిన్న ఆయన ప్రారంభించారు. రేపు జరిగే కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు పాల్గొంటారని, ఛాయచిత్ర ప్రదర్శన కూడా రేపటి వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. హైదరాబాద్ విమోచనం కోసం పోరాడిన యోధుల చరిత్ర భావితరాలకు తెలిసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని బండిసంజయ్ సూచించారు. ఇలా ఉండగా రేపు ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన ఆహ్వానాన్ని బీజేపీ తిరస్కరిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజలు మర్చిపోయేలా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాము భాగస్వాములం కాలేమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. నాటి పోరాట వీరుల త్యాగాలను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్త్ లో సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రజలు గుర్తిస్తారని కిషన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

డెస్క్

రాజీవ్

హైదరాబాద్ లో సచివాలయం వద్ద మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం ఆవిష్కరిస్తారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఇదిలా ఉండగా సచివాలయం వద్ద తెలుగు తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్ విగ్రహాన్ని పెట్టడం స్వార్థ రాజకీయమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు విమర్శించారు. ఇది తెలంగాణ తల్లిని, తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీయడమేనని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

డెస్క్

వందే భారత్

నాగపూర్ – సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సాయంత్రం అహ్మదాబాద్ నుంచి వర్చువల్ గా జెండా ఊపి ప్రారంభిస్తారు. ఈ రైలుకు

స్వాగతం పలికేందుకు సికింద్రాబాద్ స్టేషన్ లో దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. వందే భారత్ ట్రైన్ నాగపూర్ లో సాయంత్రం 4 గంటల 15 నిమిషాలకు బయల్దేరి రాత్రి 10 గంటల 45 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్ కు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి నాగపూర్ వందేభారత్ ఎక్స్ ప్రెస్ ఈ నెల 19 నుంచి అందుబాటులోకి వస్తుంది.

డెస్క్

**పీసీసీ**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బాధత్యలు చేపట్టిన మహేశ్ కుమార్ గౌడ్ కార్యవర్గం ఏర్పాటుపై దృష్టి సారించారు. ఆయన ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ ఇంఛార్జ్ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమై కార్యవర్గం ఏర్పాటు గురించి చర్చిస్తారు. పాత కార్యవర్గం, కమిటీలన్నీ రద్దు కావడంతో కొత్త కార్యవర్గాన్ని త్వరగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే పార్టీ కోసం పనిచేసిన నాయకుల వివరాలను, గతంలోని కార్యవర్గాలలో ఉన్నవారి పేర్లను మహేశ్ కుమార్ గౌడ్ పరిశీలిస్తున్నారు.

**డెస్క్**

షెడ్యూల్ బైట్ భద్రాచలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సంపూర్ణత అభియాన్ ఆకాంక్షిత గుండాల బ్లాక్, మండలంలో చిన్నపిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నారు. ప్రతి బుధ, శనివారాలతో పాటు ప్రత్యేక శిబిరాల ద్వారా కూడా ప్రతినెలా 200 మంది పిల్లలకు టీకాలు వేస్తున్నామని గుండాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనీష్ రెడ్డి ఆకాశవాణి ప్రతినిధి హరికృష్ణకు తెలిపారు.

బైట్.....

పీటీసీ కొత్తగూడెం

**మిలాద్ ఉన్ నబీ**

మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీని ముస్లింలు ఈరోజు జరుపుకుంటున్నారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ, వస్త్రదానం, ప్రార్ధనా సమావేశాలు, ఇస్లాం సంబంధిత అంశాలపై పోటీలు ఏర్పాటయ్యాయి. హైదరాబాద్ లో దాదాపు 24 చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. మసీదుల వద్ద బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీలోని మసీదులను, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. మక్కా మసీదు నుంచి రేపు నిర్వహించవలసిన మిలాద్ ఉన్ నబీ ఊరేగింపును గణేశ్ నిమజ్జనం దృష్ట్యా గురువారానికి వాయిదా వేశారు.

- డెస్క్

ట్రాఫిక్

గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ లో రేపు, ఎల్లుండి ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ సీ.వీ ఆనంద్ తెలిపారు. రేపు ఉదయం 6 గంటల నుంచి ఎల్లుండి ఉదయం 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఆయన చెప్పారు. ఈ సమయంలో ఓఆర్ఆర్ నుంచి హైదరాబాద్ నగరం లోపలికి ఇంట్రాసిటీ, ఇంటర్ సిటీ ప్రైవేట్ బస్సులకు, భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదని తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని, దాదాపు 25 వేల మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని కమిషనర్ తెలిపారు. ఖైరతాబాద్ లోని 70 అడుగుల భారీ గణేష్ విగ్రహాన్ని రేపు మధ్యాహ్నానికి నిమజ్జనం పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామని, బాలాపూర్ గణేషుడి నిమజ్జనం రేపు రాత్రికి పూర్తవుతుందని ఆయన చెప్పారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభయాత్రకు అధునాతన వాహనాన్ని వినియోగిస్తున్నారు. 75 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పు కల్గిన ఈ వాహనానికి 26 టైర్లు ఉంటాయి. దీనికి 100 టన్నుల బరువు మోసే సామర్ధ్యం ఉంది. కాగా బాలాపూర్ గణేష్ లడ్డూ వేలాన్ని రేపు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు నిర్వహిస్తామని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కే. నిరంజన్ రెడ్డి చెప్పారు. కాగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఈరోజు

హుస్సేన్ సాగర్ లోనూ, నగరంలోని ఇతర చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. దీంతో ట్యాంక్ బండ్ పరిసరాలు రద్దీగా మారాయి. శోభయాత్రల కారణంగా పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ కూడా ఏర్పడింది. గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ మెట్రో రేపు అర్ధరాత్రి 2 గంటల వరకు రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఆయా కారిడార్ల నుంచి చివరి మెట్రో రైళ్లు అర్ధరాత్రి ఒంటిగంటకు బయల్దేరి 2 గంటలకు గమ్యస్థానానికి చేరుకుంటాయి.

(డెస్క్)